
ప్రజాశక్తి

గురువారం 4 జనవరి 2024 | 5 | విజయనగరం



ఇవిఎంలపై విస్తృత అవగాహన

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఇవిఎంపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సరవణ ప్రక్రియ ప్రగతిని వివరించారు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన జరుగుతోందని చెప్పారు. ఈ నెల 22న ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. 1154 పోలింగ్ స్టేషన్లకు గానూ ఇప్పటికే 670 కేంద్రాల్లో అవగాహనా కార్యక్రమాలు పూర్తి అయ్యాయని వివరించారు. సమావేశంలో డిఆర్ఒ ఎస్‌డి అనిత, రాజకీయ పార్టీల ప్రతినిధులు రొంగలి పోతన్న, సరగడ రమేష్‌కుమార్, దయానంద్, సోములు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన అంగన్వాడీలు

దద్దరిల్లిన కలెక్టరేట్



సిడిపిఒను చుట్టుముట్టిన అంగన్వాడీలు

- 5 గంటలపాటు బైఠాయింపు
- నడిరోడ్డుపైనే భోజనాలు
- నోటీసు ఇవ్వడానికి వచ్చిన సిడిపిఒ ప్రసన్న దిగ్బంధం
- కలెక్టర్ ఇచ్చిన నోటీసూ దగ్ధం
- వేతనాలు పెంచకుంటే పతనం తప్పదని హెచ్చరిక
- మద్దతు తెలిపిన సిపిఎం, యుటిఎఫ్, సిఐటియు నాయకులు

ప్రభుత్వ నిర్లక్ష్యం, చర్చల పేరుతో సాగదీత వైఖరి, మోసపూరిత ప్రకటనలకు వ్యతిరేకంగా అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన, నినాదాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. సిఎం డౌన్‌డౌన్.. అంటూ చేసిన నినాదాలు ఆ ప్రాంతం మార్మోగింది. నడిరోడ్డుపై అంగన్వాడీలు బైఠాయించి, అక్కడే భోజనాలు చేశారు. నోటీసులు ఇవ్వడానికి వచ్చిన విజయనగరం అర్బన్ సిడిపిఒ ప్రసన్నను అంగన్వాడీలు చుట్టుముట్టారు. కలెక్టర్ జారీచేసిన నోటీసులను దగ్ధం చేశారు. చివరికి పోలీసులు ట్రాఫిక్ మళ్లించుకోవాల్సి వచ్చింది. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన 23 రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెచేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట బుధవారం బైఠాయించారు. జిల్లాల నలుమూల నుంచీ కార్యకర్తలు, ఆయాలు తరలివచ్చారు. సిపిఎం, సిఐటియు, యుటిఎఫ్, ఆశావర్కర్స్ యూనియన్, తదితర కార్మిక, ఉద్యోగ, ప్రజాసంఘాల నాయకులు వచ్చి మద్దతు ప్రకటించారు.

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని బుధవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఉదయం 10 గంటలకు జిల్లా వ్యాప్తంగా వేలాదిగా తరలి వచ్చి కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేశారు. దీంతో వందల మందితో పోలీసులు అక్కడ మోహరించారు. అంగన్వాడీలు భారీగా తరలిరావడంతో బొబ్బిలి నుంచి వచ్చే వాహనాలను బాలాజీ మార్కెట్ మీదుగా ఆర్అండ్‌బి వైపు, విజయనగరం బస్టాండ్ వైపు నుంచి వచ్చే వాహనాలను రైల్వే స్టేషన్, బాలాజీ మార్కెట్ మీదుగా కెఎల్ పురం రోడ్డు వైపు మళ్లించారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఆందోళన సాగింది. జిల్లా కలెక్టర్ జారీ చేసిన నోటీసు విజయనగరం అర్బన్ సిడిపిఒ అంగన్వాడీలకు ఇచ్చేందుకు వచ్చారు. దీంతో ఆగ్రహించిన అంగన్వాడీలు ఆమెను చుట్టుముట్టారు. 23 రోజుల నుంచి ఆకలితో అనేక ఇబ్బందులు పడి ఉద్యమం చేస్తుంటే, తమ కోసం ఆలోచించకుండా నోటీసు పట్టుకొని రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు అరగంట పాటు ఆమెను కదలనివ్వకుండా అడ్డుకున్నారు. అనంతరం సిడిపిఒ మాట్లాడుతూ నోటీసు ఇచ్చి వెళ్లిపోదామని వచ్చాను తప్ప తనకు ఎటువంటి ఉద్దేశమూ లేదని, తప్పుగా భావించవద్దని చెప్పడంతో ఆమెను విడిచిపెట్టారు.

జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన అంగన్వాడీలు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. అంగన్వాడీలతో పెట్టుకున్న ప్రభుత్వాలు, నాయకులు బతికి బట్ట కట్టలేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులు బి.పైడిరాజు, ఎస్.అనసూయ హెచ్చరించారు. సిఎం జగన్మోహన్ రెడ్డి కూడా అంగన్వాడీలతో పెట్టుకోవద్దన్నారు. జిల్లా కలెక్టర్ వచ్చి తమ సమస్యలు వినాలని డిమాండ్ చేశారు. తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నామని చెప్పారు.

అంగన్వాడీల పోరాటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు టివి రమణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సుధారాణి మద్దతు తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని మాట్లాడుతూ 23 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే, ప్రభుత్వం స్పందించి సమస్యకు పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యంగా ఉండటం దారుణమన్నారు. పోరాటాలు అంగన్వాడీలకు కొత్తేమీ కాదన్నారు. గుర్రాలతో తొక్కించినా, అరెస్టులు చేసినా, వాటర్ ట్యాంకర్లతో బెదరకొట్టినా వెనుకడుగు వేయలేదని గుర్తుచేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం ఆగదని, ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునే వరకూ సమ్మె కొనసాగుతుందని తేల్చిచెప్పారు. అంగన్వాడీల పోరాటానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు కలెక్టర్ రాకపోవడంతో మంగళవారం ఇచ్చిన నోటీసును దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.రమణ, బి.సూర్యనారాయణ, మద్దిల రమణ, యుఎస్.రవికుమార్, ఎ.గౌరినాయుడు, బి.శ్రీను, ఎ.సురేష్, ముత్యాలు, అంగన్వాడీ నాయకులు కృష్ణమ్మ, వరలక్ష్మి, మాలతి, జ్యోతి, వెంకటలక్ష్మి, రమణమ్మ, కామేశ్వరి, నిర్మల, ప్రభావతి, శివలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై భోజనాలు చేస్తున్న అంగన్వాడీలు




ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు

బకాయిలు చెల్లించాలని

ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలని కోరుతూ బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన 12 గంటల ధర్నా చేపట్టారు. ధర్నాను ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ ఒకటో తేదికి చెల్లించాల్సిన జీతాల కోసం 20వ తేది వరకూ ఎదురు చూడాల్సి వస్తోందన్నారు. సకాలంలో జీతాలు రాకపోవడంతో బ్యాంకుల్లో చేసిన అప్పులకు పెనాల్టీలు కట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. వివిధ అవసరాల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎస్ఐ, సరెండర్ లీవ్ చెల్లింపులు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సకాలంలో డిఎలు ప్రకటించడం లేదని, అప్పుడప్పుడు ప్రకటించినా వాటి ఎరియర్లు ఎప్పుడు చెల్లిస్తారో తెలియదన్నారు. గతేడాది ఆగస్టు 24న జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో 2023 సెప్టెంబర్‌కి అన్ని బకాయిలు చెల్లిస్తామని మంత్రివర్గ ఉప సంఘం, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చినా ఇంతవరకు చెల్లింపు చేయలేదని ఆక్షేపించారు. అధికారులతో బకాయిల గురించి ప్రస్తావించినప్పుడల్లా వచ్చే నెలలో చెల్లిస్తామని దాటవేస్తున్నారు తప్ప ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే పిఆర్‌సి బకాయిలతోపాటు అన్ని రకాల ఆర్థికపరమైన బకాయిలు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని కోరారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమేష్ చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడారు. ధర్నాలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నమూనా చెక్కు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్‌పి చైర్మన్ మజ్జి, కలెక్టర్ నాగలక్ష్మి

2,85,675 మందికి పింఛను లబ్ధి

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా వ్యాప్తంగా 2,85,675 మందికి రూ.3 వేల వైఎస్ఆర్ పింఛను కానుక లబ్ధి చేకూరుతుందని, రూ.83.54 కోట్లు అందిస్తున్నామని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం వైఎస్ఆర్ పింఛను కానుక ద్వారా పెంచిన రూ.3 వేలు అందించే కార్యక్రమంలో భాగంగా కాకినాడ రంగరాయ వైద్య కళాశాల మైదానంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. లైవ్‌లో స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియం నుంచి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొని వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును, సిఎం లేఖను, పింఛనును అందజేశారు.

కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, జిఎస్‌డబ్ల్యు జిల్లా కో ఆర్డినేటర్ నిర్మల దేవి, మెప్మా పీడీ సుధాకర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెవివి సమతా నాయకులు, ఉపాధ్యాయులు

స్ఫూర్తి ప్రదాత.. సావిత్రిబాయి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే మహిళలకు ఎప్పటికీ స్ఫూర్తి ప్రధాతేనని ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ అన్నారు. నగరంలోని 46వ డివిజన్ పరిధిలో ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే 193వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయి స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు. దేశ తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే అందరికీ ఆదర్శమని జనవిజ్ఞాన వేదిక సమతా విభాగం జిల్లా కన్వీనర్ జి.నిర్మల అన్నారు. నగరంలోని కస్పా హైస్కూల్లో సమతా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శంకరరావు, జెవివి నాయకులు లక్ష్మణరావు, ఉపాధ్యాయులు సావిత్రి బాయి పూలే జీవితంపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కలెక్టరేట్ వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు జనసేన నేత గురాన అయ్యలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో జనసేన సైనికులు ఏంటి రాజేష్, అడబాల వెంకటేష్ నాయుడు, పృథ్వీ భార్గవ్, గురజాపు వెంకటేష్ , కంది సురేష్ పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జ్యోతిబాయ్ పూలే చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి పార్లమెంటరీ ప్రధానకార్యదర్శి ముద్దాడ మధు, బిసి సంక్షేమ సంఘం నాయకులు గదుల సత్యలత, పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఎఎంసి చైర్‌పర్సన్ శశిభార్గవి పాల్గొన్నారు.

14వ రోజుకు సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్రశిక్ష ఉద్యోగులు చేపడుతున్న బుధవారం 14వ రోజుకు చేరింది. కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరం వద్ద సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన కొనసాగించారు. మరోవైపు కెజిబివి ఉద్యోగులు విధుల్లోకి చేరుకుంటే ఉద్యోగాల నుంచి తీసేస్తామని జిల్లా విద్యా శాఖ అధికారులు బుధవారం బెదిరింపులకు పాల్పడ్డారు. కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న ఉద్యోగులను డిఇఒ లింగేశ్వరరెడ్డి పిలిపించి కెజిబివి ఉద్యోగులు విధుల్లో చేరాలని, లేకుంటే ఉద్యోగాల నుంచి తప్పించాలని ఎస్‌పిడి నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పారు. దీంతో స్పందించిన జెఎసి నాయకులు గురువులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చిచెప్పి బయటకు వచ్చేశారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తాము ప్రభుత్వాన్ని కొత్తగా ఏమీ అడగలేదని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నామని తెలిపారు.కార్యక్రమంలో శ్రీనివాసరావు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు భువనమ్మ భరోసా

రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరంకోట, తెర్లాం, రామభద్రపురం

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మరణించిన కార్యకర్తల కుటుంబాలకు నారా భువనేశ్వరి భరోసానిచ్చారు. న్యాయం కావాలి కార్యక్రమంలో భాగంగా విజయనగరం నగరంతోపాటు తెర్లాం మండలంలో భువనేశ్వరి పర్యటించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో విజయనగరంలోని 23వ డివిజన్ పరిధిలోని కోరాడ అప్పారావు, తెర్లాం మండలంలోని పెరుమాళిలో మైలపల్లి పైడియ్య, మోదుగువలసలో గుల్లిపల్లి అప్పలనాయుడు అనే టిడిపి కార్యకర్తలు మరణించడంతో వారి కుటుంబాలను నారా భువనేశ్వరి పరామర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. టిడిపి అధికారంలోకి వచ్చాక బాధిత కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. బాధితులకు అన్నివేళలా అండగా నిలుస్తామని భరోసా కల్పించారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి

ఘన స్వాగతం

న్యాయం కావాలి కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యటనకు వచ్చిన నారా భువనేశ్వరికి టిడిపి శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. చెల్లూరు జంక్షన్ వద్ద ఆమెకు టిడిపి నియోజకవర్గ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు, కిమిడి కళావెంకటరావు, గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ మంత్రులు సుజయ్‌కృష్ణ రంగారావు, కోండ్రు మురళీమోహన్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు కిమిడి నాగార్జున, అదితి గజపతిరాజు, బేబినాయన, మాజీ ఎమ్మెల్యేలు మీసాల గీత, కె.ఎ.నాయుడు, తెంటు లక్ష్మునాయుడు, సత్యంనాయుడు, నాయకులు ఐవిపి రాజు, లక్ష్మీ వరప్రసాద్, బొద్దుల నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని 20వ డివిజన్‌కు చెందిన వైసిపి కార్యకర్తలు బుధవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆమె పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని చెప్పారు. అందుకే ఆ పార్టీని వీడి టిడిపిలో చేరికలు పెరుగుతున్నాయని తెలిపారు.

కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు,, కార్యదర్శి బంగారు బాబు, చంద్రశేఖర్, ఎ.ఎ.రాజు పాల్గొన్నారు.

ప్రజారోగ్య భద్రతే లక్ష్యం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల ఆరోగ్య భద్రతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర పునరుద్ఘాటించారు. బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్నిఒకటో డివిజన్ పూల్‌బాగ్ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలను నిశితంగా కోలగట్ల పరిశీలించారు. వారికి అందిస్తున్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్లు బండారు ఆనందరావు, మారోజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

భారీగా ఎస్ఐల బదిలీలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఎస్ఐల బదిలీలు బుధవారం భారీగా జరిగాయి. 26 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్‌పి దీపిక ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రాంతం
ఎస్.భాస్కరరావు	విఆర్	గుర్ల
డి.రామగణేష్	డిఎస్‌బి	నెల్లిమర్ల
ఆర్.గోపాలరావు	డిఎస్‌బి	లక్కవరపుకోట
బి.గణేష్	విజయనగరంరూరల్	ఆండ్ర
కెకెకె నాయుడు	గంట్యాడ	చీపురుపల్లి
ఎస్.కృష్ణమూర్తి	భోగాపురం	డెంకాడ
యు.మహేష్	డెంకాడ	గజపతినగరం
పి.నారాయణరావు	నెల్లిమర్ల	దిశ పోలీస్‌స్టేషన్
జి.లోవరాజు	శృంగవరపుకోట	బొబ్బిలి
వై.వి.జనార్ధన్	కొత్తవలస	వంగర
వి.జ్ఞానప్రసాద్	బొబ్బిలి	రామభద్రపురం
బి.భాగ్యం	బొబ్బిలి	సిసిఎస్
బి.సురేంద్రనాయుడు	రామభద్రపురం	గంట్యాడ
సిహెచ్.గంగరాజు	గజపతినగరం	శృంగవరపుకోట
ఎస్.రవి	బొండపల్లి	సిసిఎస్
పి.సిద్ధార్థకుమార్	ఆండ్ర	డిసిఆర్‌బి
ఎ.సన్యాసినాయుడు	చీపురుపల్లి	విఆర్
ఎస్.హరిబాబునాయుడు	గుర్ల	విజయనగరం వన్‌టౌన్
పి.నీలావతి	రాజాం	దిశ పోలీస్‌స్టేషన్
విబి రామకృష్ణారావు	రాజాం	బొబ్బిలి ట్రాఫిక్
పి.శ్యామలాదేవి	దిశ పిఎస్	విజయనగరం రూరల్
నసీమాబేగం	విజయనగరంరూరల్	సిసిఎస్
కె.లక్ష్మణరావు	దిశ పిఎస్	బొండపల్లి
ఆర్.వాసుదేవు	డిసిఆర్‌బి	విజయనగరంరూరల్
ఎం.ప్రశాంత్‌కుమార్	సిసిఎస్	డిటిసి
జి.పోలినాయుడు	బొబ్బిలి ట్రాఫిక్	రాజాం

డ్రగ్ ఫ్రీ ఛాలెంజ్‌పై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్ఇబి సంయుక్తంగా డ్రగ్ ఫ్రీ ఇండియా ఛాలెంజెస్ అనే అంశంపై బుధవారం సెమినారు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి.జనార్ధన్ నాయుడు మాట్లాడుతూ యువత మత్తుకు దూరంగా ఉండాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.సుభ మాట్లాడుతూ మత్తు మొదట ఆనందంగా ఉంటుందని, తరువాత జీవితాన్ని మార్చేస్తుందని తెలిపారు. ఎస్ఇబి ఎఎస్‌పి శైలజ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ జివిఎస్ జయపాలరావు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎస్ఇబి సిఐ మధుకర్, టాస్క్‌ఫోర్స్ సిఐ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేటి నుంచి కార్మికుల సమ్మె

బొబ్బిలి: ఎన్నికల హామీ మేరకు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేపట్టినప్పటికీ ప్రభుత్వం హామీలను అమలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో వాటర్, ఎలక్ట్రికల్ కాంట్రాక్టు కార్మికులు గురువారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ అత్యవసర సేవలకు సమ్మె నుంచి మినహాయింపు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం హామీలను అమలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో అత్యవసర సేవలను నిలిపి వేస్తున్నామని చెప్పారు. హామీలను అమలు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాటర్, ఎలక్ట్రికల్ కార్మికులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు నోటీసులు

భోగాపురం: ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు జిల్లా కలెక్టర్ నోటీసులను జారీ చేశారు. సమ్మె విరమించి ఈ నెల 5వ తేదీలోగా విధుల్లో చేరాలని నోటీసులో పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు ఈ నోటీసులు తీసుకోకపోవడంతో అంగన్వాడీ కేంద్రాల వద్ద వాటిని అతికించారు.

ఒకరికి రెండు బ్యాంకు ఉద్యోగాలు

బొబ్బిలి రూరల్: పెంట గ్రామానికి చెందిన పువ్వల నరేష్ రెండు బ్యాంకుల్లో ఉద్యోగం సాధించి సత్తా చాటారు. విజయవాడలో కోచింగ్ తీసుకుంటున్న నరేష్ ఐడిబిఐ బ్యాంక్ పిఒగా, రీజనల్ రూరల్ బ్యాంక్ క్లర్క్‌గా ఉద్యోగం సాధించి సత్తా చాటారు. నరేష్ తండ్రి పువ్వల కృష్ణమూర్తి వ్యవసాయం చేయగా తల్లి లక్ష్మి గృహిణి. రెండు బ్యాంకుల్లో నరేష్ ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నరేష్ ఒకటి నుంచి పదో తరగతి వరకు పెంట జిల్లా పరిషత్ పాఠశాల, ఇంటర్ వాసు జూనియర్ కళాశాల, డిగ్రీ ఆంధ్రా యూనివర్సిటీలో పూర్తి చేశాడు. బ్యాంక్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదవడంతో ఉద్యోగం సాధించానని నరేష్ తెలిపారు.

ఆడపిల్లల రక్షణ చర్యలపై పోటీలు

రామభద్రపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడపిల్లలు రక్షించుకుందాం అనే అంశంపై మండల స్థాయిలో వివిధ విభాగాల్లో బుధవారం పోటీలు నిర్వహించారు. ఎంఇఒ తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రామభద్రపురం, కొట్టక్కి, నాయుడు వలస తదితర పాఠశాలల నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో బాలికా సంరక్షణ అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. వ్యాసరచనలో శరత్ నాయుడు, మేఘన ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించగా వక్తృత్వ పోటీల్లో నాగేశ్వరి దేవి, నిహారిక, చిత్రలేఖనంలో మేఘనాథ్, లిఖిత వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. ప్రథమ బహుమతి పొందిన వారు ఈ నెల 6న విజయనగరం మహారాజ సంస్కృత ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనవలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కామేశ్వరరావు, ఉపాధ్యాయులు దాలి నాయుడు, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ నీటితో ఎక్కువ సాగు

శృంగవరపుకోట: బిందు తుంపర సేద్యం వల్ల తక్కువ నీటితో ఎక్కువ సాగు చేయవచ్చునని ప్రాజెక్ట్ డైరెక్టర్ పివిఎస్ లక్ష్మీ నారాయణ అన్నారు. మండలంలోని కొత్తూరు, వినాయకపల్లి, వెంకటరమణపేట గ్రామాల్లో రాయితీపై అందించిన తుంపర సేద్యం యూనిట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతాలలో పంట సాగుకు బిందు తుంపర సూక్ష్మ సేద్యం విధానం లాభదాయకమన్నారు. 2023- 24 సంవత్సరానికి గాను 50 హెక్టార్ల లక్ష్యానికి గాను 20.5 హెక్టార్లలో 21 మంది రైతులకు సబ్సిడీపై అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

జనసేనలోకి కొలువాడ మాజీ సర్పంచ్ భర్త

భోగాపురం: మండలంలోని కొలువాడ పంచాయతీ మాజీ సర్పంచ్ భర్త కొండపు రమణ వైసిపిని వీడి బుధవారం జనసేనలో చేరారు. జనసేన నెల్లిమర్ల నియోజకవర్గం ఇంఛార్జి లోకం మాధవి ఆధ్వర్యంలో ఆయన అనుచరులతో పాటు సుమారు 30 మంది యువకులు పార్టీలో చేరారు. వీరందరికీ లోకం మాధవి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లోకం మాధవి మాట్లాడుతూ వైసిపి విధివిధానాలు నచ్చక తమ పార్టీలో చేరుతున్నారన్నారు. కొండపు రమణ మాట్లాడుతూ జనసేన పార్టీ విధివిధానాలతో పాటు లోకం మాధవి సిద్ధాంతాలను నచ్చి పార్టీలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్లంట్ల జగదీష్, దాడిశెట్టి శ్రీనివాసరావు, పవన్ కుమార్, దాలిరెడ్డి మాత నవీన్, బొల్లు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇవిఎంలపై అవగాహన

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో ఇవిఎంల వినియోగంపై ఓటు హక్కు కలిగిన పౌరులకు బిఎల్ఒలు బుధవారం అవగాహన కల్పించారు. వల్లంపూడి పిఎస్ నంబర్ 93లో ఓటు వినియోగంపై అవగాహన కల్పించినట్లు జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, తహశీల్దార్ బి ప్రసన్నకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి.దేవి, పంచాయతీ కార్యదర్శి, ఓటర్లు పాల్గొన్నారు.

విజేతలకు నగదు బహుమతులు

భోగాపురం: నూతన సంవత్సరం సందర్భంగా జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్ ఐజేఐక వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన జట్లకు నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ లోకం మాధవి చేతుల మీదుగా బుధవారం నగదును అందజేశారు. మొదటి స్థానంలో నిలిచిన భోగాపురం గ్రౌండ్ యూత్ జట్టుకు 5వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన అక్కి వరం జట్టుకు 3వేలు, మూడవస్థానంలో నిలిచిన భోగాపురం బి జట్టుకు 2వేలు, నాలుగో స్థానంలో నిలిచిన రెల్లి పేట జట్టుకు వెయ్యి రూపాయలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోపిశెట్టి పవన్ కుమార్, బొల్లు త్రినాథ్, మాత నవీన్, దాలిరెడ్డి, తాడిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రాము ప్రతిభ

నెల్లిమర్ల: జాతీయ స్థాయి పురుష మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో యువజన విభాగంలో కొండవెలగాడ గ్రామానికి చెందిన డి. రామ కాంస్య పతకం సాధించాడు. అరుణాచల్ ప్రదేశ్ ఇటానగర్ రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో గత నెల 28 నుంచి జరుగుతున్న జాతీయ స్థాయి మెన్, ఉమెన్, యూత్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రాము స్నాచ్ 121 కిలోలు, క్లీన్ జర్క్ 161 కిలోలు మొత్తం 282 కిలోలు బరువెత్తి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా రాముని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.లక్ష్మీనారాయణ, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి. వెంకట రమణయ్య, బి .లక్ష్మీ కోచ్ చల్లా రాము అభినందించారు.

నగర పంచాయతీలో ఆరోగ్య సురక్ష

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట-1 సచివాలయం పరిధిలో రెండోదశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్లు డి.రామ నాయుడు, ఎల్.వినోద్ కుమార్, జి.మౌనిక, బి.నారాయణరావు 150 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వివిధ బోర్డుల డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, మెడికల్, అంగన్వాడీ, మెప్మా, నగర పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాబోయేది టిడిపి ప్రభుత్వమే

శృంగవరపుకోట: రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని టిడిపి నియోజకవర్గం ఇంచార్జి కోళ్ల లలితకుమారి అన్నారు. పట్టణంలోని ఎం.కెరావు కాలనీలో 17, 18వ బూత్ నెంబర్లలో వార్డు మెంబర్ పెదగాడగాల, గుడుపు ప్రణీష్, బత్తుల కృష్ణ, గుంపాలది వాసు ఆధ్వర్యంలో బుధ వారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మినీ మేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు, జెడ్‌పిటిసి అభ్యర్థి భీసెట్టి అరుణ, బోనంగి జ్యోతి, పట్టణ పార్టీ అధ్యక్షులు కోనేరు మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రైతులు గగ్గోలు..

- అన్నదాతను దోచేస్తున్న మిల్లర్లు
- ఏడు కేజీల వరకు అదనంగా వసూలు
- ప్రశ్నిస్తే లోడ్లు వెనక్కి పంపిస్తున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న కర్షకులు

ప్రజాశక్తి- రేగిడి

అన్నదాతలకు అడుగడుగునా ఆటంకాలు తప్పడం లేదు. మొన్న వర్ష భావం కారణంతో కొంత పంట నష్టం వాటిల్లగా నిన్నేమో తుపాను కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. వచ్చిన కొద్దిపాటి పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న ధాన్యాన్ని రైతు మిల్లర్లకు పంపిస్తే అక్కడ 80 కేజీలకు గాను, 87 నుంచి 90 కేజీల వరకు (7నుంచి10కేజీలు) అదనంగా తూనికలు వేసి రైతుల ధాన్యాన్ని. దోచేస్తున్నారు. ప్రభుత్వం 80 కేజీలు తూనికలకు అంగీకరిస్తే మిల్లర్లు ఈ విధంగా దగా చేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏమైనా ప్రశ్నిస్తే తీసుకువెళ్లిన లోడులను వెనక్కి పంపిస్తున్నారు. దూర ప్రాంతాల నుండి ధాన్యాన్ని ఎడ్ల బల్లతో మిల్లర్లకు తీసుకువెళ్లడంతో ఏమి తోచన పరిస్థితులలో ఎడ్ల బళ్ళు అద్దెలు కట్టుకోలేక తప్పనిసరిగా అదనపు ధాన్యాన్ని ఇవ్వవలసిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. రైతే రాజు అన్న ప్రభుత్వం, కస్టోడియన్ అధికారులైన విఆర్ఒలు, ఆర్ఐ, తహశీల్దార్, ఫుడ్ కార్పొరేషన్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పాటు రైతుల బాధలు పట్టించుకోకపోవడంతో రైతులం ఎలా బతికేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని కొండల మామిడి వలస, పారం పేట, కోడిశ , సోమరాజుపేట గ్రామాల్లో ఉన్న రైస్ మిల్లర్లకు ప్రభుత్వం ధాన్యం ఆడేందుకు అనుమతులు మంజూరు చేసింది. అయితే ప్రభుత్వ నిబంధనలు ప్రకారం 80 కిలోలు ధాన్యం బస్తాను తీసుకోవాల్సిన మిల్లర్లు ఒక్కో రైతు నుంచి అధనంగా 7 కిలోలు ధాన్యం తీసుకుని మొత్తం 87 నుంచి 90 కిలోల మధ్య ధాన్యాన్ని సేకరిస్తున్నారు. ఈ విధంగా మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారు. మిల్లర్ల ఒత్తిడిని తట్టుకోలేని కొంత మంది రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించాల్సి వసుందని చెబుతున్నారు.

ప్రకటనలకే పరిమితం

తుపాను కారణంగా తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు




రైతు నుండి అదనంగా ధాన్యం వసూలు చేస్తున్న రైస్ మిల్లు ఇదే

కేంద్రానికి తరలించి మంచి ధర కల్పిస్తామని మంత్రి, జెడ్‌పి చైర్మన్ చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు కొనగోళ్లకు ముందు ఆర్‌బికెల్లో రైతులతో సమావేశమై ఊకదంపుడు ఉపన్యాసాలే ఇచ్చారు తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదని రైతులు ఎద్దేవా చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులైన మిల్లర్ల పై చర్యలు తీసుకు సక్రమంగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

దళారులదే హవా

మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకోవడంతో పాటు డబ్బులు వెంటనే చెల్లించకపోవడం, తరలింపునకు అధనపు భారం పడటంతో రైతులు దళారుల వైపు మొగ్గు చూపుతున్నారు. దళారులు ప్రభుత్వం ధర కంటే తక్కువే ఇచ్చినా నేరుగా కళ్లాలకు వచ్చి ధాన్యం తరలించుకోవడంతో పాటు డబ్బులు వెంటనే చెల్లించేయడంతో చాలా మంది రైతులు దళారులకే ఇచేస్తున్నారు. దీంతో వారి హవా కొనసాగుతోంది.

అదనపు కేజీలు తీసుకుంటున్నారు.



మిల్లర్లు 80 కేజీలకు బదులుగా 87 నుంచి 90 కేజీల వరకు ధాన్యం అదనంగా తీసుకుంటున్నారు. ప్రశ్నిస్తే తిరిగి పంపించేస్తున్నారు. అధికారులు పర్యవేక్షణ కొరవడింది. తిరిగి వచ్చిస్తే వ్యయ ప్రయాసాలు తప్పవన్న బాధతో మిల్లర్లు డిమాండ్ మేరకు అదనంగా ధాన్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఇది చాలా ఘోరంగా ఉంది. పరిస్థితి మారకపోతే రైతు చాలా నష్టపోతాడు.

దాలినాయుడు, రైతు, సంకిలి.

మిల్లర్లుపై నిఘా ఉంచాలి

పారంపేట, కెఎం.వలస, కోడిశ, సోమరాజుపేట గ్రామాల్లో రైస్ మిల్ యాజమాన్యం రైతుల వద్ద అదనంగా ధాన్యం తీసుకుంటున్నాయి. రైతులను మోసం చేయకుండా మిల్లర్లపై అధికారులు నిఘా ఉంచాలి. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. రైతుకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అధికారులు మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి.

నారు జనార్ధన రావు, రైతు సంఘం అధ్యక్షులు

మా దృష్టికి రాలేదు

రైతుల వద్ద నుంచి మిల్లర్లు అదనంగా ఏడు నుంచి పది కేజీలు తీసుకుంటున్న విషయం మా దృష్టికి రాలేదు.. సిఎస్‌డిటి కామేశ్వరరావుకు బాధ్యతలు అప్పగించాం. పరివేక్షణ తరువాత విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

సుదర్శన్ రావు, తహశీల్దార్, రేగిడి

ఆర్‌బికెల్లో కొనుగోలు చేస్తున్నాం

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. మిల్లర్లకు రైతుల ద్వారా పంపిస్తున్నాం. మిల్లర్లు అదనంగా ధాన్యం వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. కానీ సమస్యను పరిష్కరించే అధికారం మాకు లేదు. సిఎస్‌డిటి, డిఎస్ఒలు చర్యలు తీసుకోవాలి.

- మురళీకృష్ణ, ఎఒ, రేగిడి

రెగ్యులర్ చేసే వరకూ సమ్మె

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.గౌరీష్ అన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగింది. కాంట్రాక్టు కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్‌టిఆర్ విగ్రహం వరకు ర్యాలీ చేసి మానవహారం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్మికుల పోరాటానికి టిడిపి మాజీ కౌన్సిలర్ కాకల వెంకటరావు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం నగర పంచాయతీ నుంచి మొయిద కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి. బాబూ రావు, బి. హరి బాబు, జె.శ్రీను, బి. రాము, టి. లక్ష్మీ పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మె 9వ రోజుకి చేరింది. విజయనగరం నగరపాలక సంస్థ వద్ద



బొబ్బిలి: రాస్తారోకో చేస్తున్న కార్మికులు

డిసెంబర్ 26 నుంచి కొద్దిమంది కార్మికులు సమ్మె చేస్తూ తమ నిరసనను తెలియజేశామని, రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో మొత్తం పారిశుధ్య కార్మికులు పనులు బందు చేసి గురువారం నుంచి సమ్మెలో పాల్గొంటున్నారనీ సిఐటియు అనుబంధ సంఘం ఆధ్వర్యంలో కమిషనర్‌కి తెలియజేశామని యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ. జగన్మోహన్రావు తెలిపారు. అంతకు ముందు సమ్మె శిబిరంలో కార్మికులు అర్ధ నగ్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్ రావు, రామచంద్రరావు, రజిని, రాఘవ, శ్రీను, మురళి, శంకర్రావు, నారాయణరావు బాలాజీ, లక్ష్మి, లక్ష్మణరావు చిన్ని తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండలానికి సంబంధించిన నూతన పింఛన్లను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకునేందుకు ఏటా పింఛన్ సొమ్మును ప్రభుత్వం పెంచుతూ వచ్చిందన్నారు. రానున్న ఎన్నికలలో కూడా జగన్ మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, వైస్ ఎంపిపి కర్రి శ్రీను, తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు, పల్లా భీష్మ, పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలో గల సచివాలయ ఆవరణలో రూ.3వేలు పింఛను మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేతుల మీదుగా బుధవారం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వి.వి చిన్నరామునాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ కసమ్మూరి, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు జగ్గు బాబు, సర్పంచ్ ఎం అర్జునమ్మ, ఎంపిటిసి గాడి గంగతల్లి, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సన్యాసినాయుడు, పంచాయతీ విస్తరణాధికారిని ఉమా,



కొత్తవలస: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి గౌరీ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పింఛన్లు పెంపుతో పేదల్లో ఆనందం కనిపిస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పింఛన్లను పంపిణీ చేశారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ పార్టీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ ఛైర్మన్ చెలికాని మురళి, వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

క్రీడలతో మానసికొల్లాసం వస్తుందని ఎంపిపి మహంతి కళ్యాణి అన్నారు. బుధవారం మండలంలోని చౌడువాడ, కొల్లాయివలస సచివాలయ పరిధిలో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా క్రీడలను ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికే ఈ క్రీడలను ప్రభుత్వం నిర్వహి స్తుంద న్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి ఎన్.సత్యనారాయణ రాజు, నాయకులు మహంతి జనార్ధనరావు, ఎం. నాగబాబు, కొయ్య ఎల్లన్న రెడ్డి, తాడిశెట్టి బాబు, ఎంపిడిఒ రాధిక, హెచ్ఎం చలం పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని పెద్దతాడివాలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తనయుడు ప్రదీప్ నాయుడు, వైస్ ఎంపిపి తమ్మినాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరుమజ్జి త్రినాధరావు, ఎంపిటిసి గాధిపిల్లి రమేష్, పినతాడివాడ సర్పంచ్ లక్ష్మణరావు, ఎంపిటిసి అచ్చింనాయుడు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, పీడీలు, పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక థామస్‌పేట ఫుడ్‌బాల్ మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను కమిషనర్ బాలాజీ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. కాసేపు క్రీడాకారులతో ముచ్చటించి సూచనలు చేశారు. ఈ నగర పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

భోగాపురం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను సంక్రాంతి లోపు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిడిఒ ఎన్.అప్పలనాయుడు అన్నారు. ఆయన కార్యాలయంలో బుధవారం వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి 114 చొప్పున టీ షర్టు, క్యాప్ లను అందజేసిందన్నారు. సచివాల స్థాయిలో గెలుపొందిన వారందరికీ వీటిని అందజేస్తామని తెలిపారు.

స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఇందిరమ్మకాలనీలో ఖాళీ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ అధికారులు సర్వే నివేదికను బయట పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీ లేఅవుట్‌లో 2,459 స్థలాలు ఏర్పాటు చేయగా 1424 మంది ఇల్లు నిర్మించుకున్నారని, 479 మంది పునాదులు నిర్మించారని, 556 స్థలాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఖాళీ స్థలాలు కాపాడేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ డోల రాజేశ్వర రావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే అడ్డుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిడిఒ పద్మజ ఆధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గృహ నిర్మాణ శాఖ, తాగునీరు, వ్యవసా యంపై ప్రత్యేక చర్చ పెట్టారు. ముందుగా వ్యవసా య శాఖ అధికారిని మాధురి శరణ్య సభలో సభ్యుల దృష్టికి ధాన్యం కొనుగోలు, తుఫాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతుల ఎంపిక పాడి పంటలపై వివరించారు. తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా మాట్లా డుతూ ఇప్పటి వరకు మండలంలో 1800 మందిని ఇళ్ల పట్టాలకు ఎంపిక చేశామని వారికి జనవరి నెలాఖరులోగా పట్టాలు అందించి స్థలాలు కూడా ఇస్తామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్.సన్యాసిరావు మాట్లాడుతూ మండలంలో ఇంటింటికి తాగు నీరు అందించే కార్యక్రమం మొదలయిందన్నారు. ఇదే సమావేశంలో నిమ్మలపాలెం సర్పంచ్ కె.నిర్మల సాయి లేకపోయినా ఆమె భర్త కె. శ్రీను ఎటువంటి పదవి లేకపోయినా సభలో సభ్యుడు కాకపోయినా అధికారులను ప్రశ్నిస్తూ కనిపి ంచారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పదివేల మందికి ఇళ్ల పటాలు ఇచ్చామన్నారు. తుఫాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం బాసటగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైస్ ఎంపిపి కర్రీ శ్రీను, గొరపల్లి శివ, ఇఒపిఆర్‌డి కర్రీ ధర్మారావు, విద్యుత్ శాఖ ఎఇ ఇమంది అప్పారావు, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

బాలికలకు సావిత్రిబాయి పూలే ఆదర్శం

ప్రజాశక్తి - రామభద్రపురం

నేటి బాలికల విద్యాభివృద్ధికి సావిత్రి బాయి పూలే ఆదర్శమని రోటరీ క్లబ్ అధ్యక్షులు, నాయుడువలస పాఠశాల ఉపాధ్యాయులు జెసి రాజు అన్నారు. బుధవారం పాఠశాలలో సావిత్రి బాయ్ పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఉపాధ్యాయులు ,విద్యార్థులు ఆమె చిత్ర పటానికి పూల మాలవేసి నివా ళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగ భూషణం, ఉపాధ్యాయ సిబ్బంది రెడ్డి రవి, శివున్నా యుడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

వేపాడ: వల్లంపూడిలో దళిత మహాసభ అధ్యక్షుడు కొమ్మనాపల్లి రాము ఆధ్వర్యంలో బుధవారం సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలో చిన్నారులు చేసిన నృత్యాలు, వేశధారణ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ఉపాధ్యాయ లోకానికి ఆదర్శ మహిళ సావిత్రిబాయి పూలే అని ధర్మవరం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి ఉమామ హేశ్వరరావు అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివా ళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యా యులు శివరామకృష్ణ, పాఠశాల సిబ్బంది కార్యదర్శి వితఃి సత్యనారాయణ, ఉపాధ్యాయులు బి. జయ,



వేపాడ: సావిత్రి భాయ్ పూలే వేశధారణలో చిన్నారి

కే జయలక్ష్మి, డి శ్రావణి, కళ్యాణి, మూర్తి, రహీం షేక్ లాల్, ఈశ్వరరావు, ఐఎన్ ఎం మూర్తి, సతీష్ మాస్టర్, పేరినాయుడు, ఎల్‌వి సత్యనారాయణ, బి. నారాయ ణరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలో ఇందిరమ్మ కాలనీ మున్సిపల్ పాఠశాలలో ఉన్న పూలే విగ్రహానికి ఎంఇఒ-2 వాసు నాయుడు, సామాజిక కార్యకర్తలు జగదీష్, రామ్మోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించి పేదల కు దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘవీధిలో అంబేద్కర్ పోరాట సమితి ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాలికల విద్యకు సావిత్రి భాయి పూలే పని చేసారని సొరు సాంబయ్య అన్నారు.

జనసేనతోనే అభివృద్ధి

నెల్లిమర్ల: అభివృద్ధి, సంక్షేమం జనసేనతో సాధ్యమని నియోజకవర్గం జనసేన ఇంఛార్జి లోకం మాధవి తెలిపారు. మన ఊరిలో జనవాణి కార్యక్రమంలో భాగంగా మండలంలోని సీతారాముని పేటలో ఇంటింటికి వెళ్లి జనసేన సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లి అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు సమస్యలు తెలుపుతూ వీధి దీపాలు సరిగ్గా లేవని కనీసం డ్రైనేజీ వ్యవస్థ బాలేదని వాపోయారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు పంచాయతీ నిధులు అడ్డగోలుగా దోచేస్తు న్నారని గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి కనిపించడం లేదని అన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

భోగాపురం: మండలంలోని సవరవల్లి సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల్లో భాగంగా గురువారం విద్యుత్ నిలుపదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ మస్తాన్ వలి తెలిపారు. సవరవల్లి, రావాడ, కౌలువాడ, తుడెం, చాకివలస, ఏ రావివలస, సన్ రే విలేజ్, గూడెపువలస, దల్లిపేట, బైరెడ్డిపాలెం, రెడ్డికంచేరు పంచాయతీ ల్లోని వివిధ గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని వినియో గదారులు సహకరించాలని కోరారు.


బహిరంగ ప్రకటన

కొక్కిరి రాంబాబు, S/o. లేట్ గురుమూర్తి, నివాసం డోర్ నం.14-5-37, కమ్మ వీధి, విజయనగరం పట్టణం, విజయనగరం జిల్లా, అను నేను ఇందుమూలముగా ఎల్లరకు తెలియజేయునది ఏమనగా:

నా తల్లిగారైన శ్రీమతి. కొక్కిరి సీతయ్యమ్మ, W/o. లేట్ గురుమూర్తి గారు కమ్మవీధిలో, డోర్ నం.14-5-37గా గలిగిన గ్రౌండ్ ఫ్లోర్, మరియు 1వ ఫ్లోర్ కలిగిన ఆర్.సి.సి.శ్లాబ్ ఇంటికి సంపూర్ణ హక్కుదారై యున్నారు. సదరు ఆస్థి మా తల్లి గారు మా తండ్రి గారైన శ్రీ. కొక్కిరి గురుమూర్తి గారు తేదీ. 27-02-1964 న మా తల్లి గారి రిజిస్ట్రేషన్ చేయించిన సెటిల్మెంట్ డీడ్ ద్వారా సంక్రమించినది. సదరు ఇంటిపన్ను అస్సెస్మెంట్ నం. 1093033922 మరియు నీటి పన్ను నం.1093001860 విజయనగరం మున్సిపాలిటీ వారికి నా తల్లిగారి పేరున చెల్లించుచున్నాను. నా తల్లి గారైన శ్రీమతి. కొక్కిరి సీతయ్యమ్మ, W/o. లేట్ గురుమూర్తి గారు ఆమె జీవిత కాలములో వీలునామా తేదీ.25-11-1997 సదరు కమ్మ వీధిలో, డోర్ నం.14-5-37 గా గలిగిన గ్రౌండ్ ఫ్లోర్, మరియు 1 వ ఫ్లోర్ కలిగిన ఆర్. సి. సి. శ్లాబ్ ఇల్లు ఆమె తదనంతరము నాకు సర్వహక్కులతో చెందే విధముగా వ్రాయించినారు. నా తల్లిగారు తేదీ.26-08-1998 న స్వర్గస్తులయినారు. తదుపరి నా తల్లి గారు వ్రాయించిన వీలునామా తేదీ. తేదీ.25-11-1997 ప్రకారము మరియు ఆమె కుమారుడిగా వారసత్వ రీత్యా సదరు కమ్మ వీధి లో, డోర్ నం.14-5-37 గా గలిగిన ఇంటికి నేను సంపూర్ణ హక్కుదారుడిని అయి యున్నాను. ప్రస్తుతము సదరు కమ్మ వీధి లో, డోర్ నం.14-5-37 గా గలిగిన ఇంటికి, ఇంటిపన్ను మరియు నీటి పన్ను నా పేరున మార్పు చేయుటకు కమిషనర్, విజయనగరం మునిసిపల్ కార్పొరేషన్ వారికి దరఖాస్తు చేసియున్నాను. ఇందునిమిత్తమై ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి ఏడురోజులలో శ్రీ కమిషనర్, విజయనగరం మునిసిపల్ కార్పొరేషన్ వారికి లిఖితముగా తెలుపగలరు. లేనియెడల నా పేరున చేయు సదరు మార్పు లకు ఎవరికినీ ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి తదుపరి చర్యలు శ్రీ కమిషనర్, విజయనగరం మునిసిపల్ కార్పొరేషన్ వారు తీసుకొనగలరు, అని ఈ ప్రకటన మూలముగా యావన్మందికి తెలియజేయడ మైనది.

నా చిరునామా:
కొక్కిరి రాంబాబు,
S/o. లేట్ గురుమూర్తి,
నివాసం డోర్ నం.14-5-37,
కమ్మ వీధి, విజయనగరం పట్టణం,
విజయనగరం జిల్లా.

కె.కామేశ్వరరావు,
న్యాయవాది,
విజయనగరం
సెల్:9440343341



భర్తే చంపేశాడు : డిఎస్‌పి

ప్రజాశక్తి- బాడంగి

భర్తే భార్యను చంపేశాడని డిఎస్‌పి శ్రీధర్ తెలిపారు. మండలంలోని కోటిపల్లికి వంగపండు అన్నపూర్ణ (27) బావిలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డిఎస్‌పి బుధవారం విలేకర్లకు వెల్లడించారు. వంగపండు రామారావు, అన్నపూర్ణను 2019లో వివాహం చేసుకున్నాడు. ఈ మధ్య కాలంలో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో మూడు నెలల గర్భవతి అని కూడా చూడకుండా కొట్టేవాడు. దీంతో కన్నవారి ఇంటికి వెళ్లిపోయింది. మరుసటి రోజు కన్నవారి ఇంటికి వెళ్లిన రామారావు భార్యను తీసుకుని కొత్త చెరువు వద్ద పని ఉందని తీసుకుని వెళ్లాడు. దారిలో ఇద్దరూ మరోసారి గొడవలు పడ్డారు. దీంతో పక్కనే ఉన్న బావిలో అన్నపూర్ణను తోసేశాడు. బుధవారం ఉదయం గ్రామ సెక్రటరీ దగ్గరకి వెళ్లి తానే చంపేసానని అంగీకరించాడు. వెంటనే మాకు వచ్చిన సమాచారం మేరకు అతన్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని డిఎస్‌పి తెలిపారు. ఈ సమావేశంలో సిఐ తిరుమల రావు, రామభద్రపురం ఎస్ఐ సురేంద్ర నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - జామి

మండలంలోని అన్నంరాజుపేట గ్రామానికి చెందిన కంటుబుక్త లక్ష్మి (40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ మేరకు జామి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాలు ప్రకారం.. విజయనగరం నుంచి కుమారుడు సాయి కుమార్‌తో కలిసి లక్ష్మి స్వగ్రామానికి బైకు పై వస్తుండగా, కుమరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో బైకు అదుపు తప్పి, ఎదురుగా వస్తున్న సైకిలును ఢీ కొనడంతో లక్ష్మి తలకు, మొహానికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. అన్నంరాజపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Government of Andhra Pradesh
APEWIDC., Vizianagaram Division

NIT NO.EE/DB/ 13 to 15/2023-24 dt. 03.01.2024.

Tenders invited from Registered Civil Contractors for NIT No. EE/DB/ 13 to 15 dt. 03.01.2024 for 3 Works at various places from Rs.3.50 Lakhs to 26.00 lakhs.

Last date for receipt of Tenders 11.01.2024 up to 4.00 PM.

Note:- for further details can be viewed at
http// Tender "e"procurement.gov.in or Contact: 8008102811.

D.V.N. Murthy
Executive Engineer
APEWIDC., Vizianagaram.